సాక్షి వరంగల్

ఆదివారం । 15 । సెప్టెంబర్ । 2024



కవచం..కాటమయ్య కిట్

తాటిచెట్టుపై జరిగే ప్రమాదాలను చెక్ పెట్టేందుకు ప్రభుత్వం కాటమయ్య రక్షణ కిట్‌లను గీత కార్మికులకు అందజేస్తోంది. - 8లో▸



రెండో ఆర్మీగా..ఎన్‌సీసీ

రెండో ఆర్మీగా ఎన్‌సీసీ పరిగణించబడుతుందని ఎన్‌సీసీ క్యాంపు కమాండెంట్ కల్నల్ ఎస్‌కే భద్ర తెలిపారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం

34.6^0 / 22.7^0

వాతావరణం

జిల్లాలో ఉదయం సాధారణంగా ఉంటుంది. మధ్యాహ్నం నుంచి ఎండ ఉంటుంది. సాయంత్రం సమయంలో ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది.

న్యూస్‌రీల్

ఎమ్మార్సీలో ఇద్దరు ఉద్యోగుల గైర్హాజరు



వరంగల్: నర్సంపేట మండల విద్యా వనరుల కేంద్రం (ఎమ్మార్సీ)లో ఇద్దరు ఉద్యోగులు గైర్హాజరయ్యారని జిల్లా విద్యాశాఖాధికారి మామిడి జ్ఞానేశ్వర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల కలెక్టర్ సెలవు ప్రకటించగా 14న విధులు నిర్వర్తించాలని ఆదేశాలు జారీ చేసినట్లు పేర్కొన్నారు. శనివారం ఎమ్మార్సీ భవనాన్ని తనిఖీ చేయగా.. ఎంఐఎస్ మాత్రమే ఉండగా కంప్యూటర్ ఆపరేటర్, మెసెంజర్ గైర్హాజరైనట్లు గుర్తించామన్నారు. పై అధికారులు, అకౌంటెంట్ జనరల్ కార్యాలయం నుంచి వచ్చిన అప్లికేషన్లనే నమోదు చేసి, ఆఫీస్‌కు వచ్చిన అప్లికేషన్లు నమోదు చేయలేదన్నారు. గైర్హాజరైన ఇద్దరు కాంట్రాక్టు ఉద్యోగులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం నర్సంపేటలోని ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించినట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించాలి : డీఐఈఓ




వర్ధన్నపేట: విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని జిల్లా ఇంటర్‌మీడియట్ విద్యాశాఖాధికారి డాక్టర్ శ్రీధర్ సుమన్ సూచించారు. వర్ధన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ గుర్లా వెంకటయ్య అధ్యక్షతన శనివారం నిర్వహించిన ఫ్రెషర్స్ డేలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఇష్టపడి చదివి పఠనాసక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. డీఐఈఓ శ్రీధర్ సుమన్, కళాశాల నుంచి బదిలీ అయిన ప్రిన్సిపాల్ జితేందర్‌రెడ్డి, భౌతికశాస్త్ర అధ్యాపకురాలు జ్యోతిర్మయిని పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. అధ్యాపకులు రాజేంద్రప్రసాద్, సంధ్యారాణి, డాక్టర్ వేణుమాధవి, సమీనా, తిరుపతి, రాజ్‌కుమార్, స్వరూప, శారద, విద్యార్థులు పాల్గొన్నారు.

వంద శాతం రాయితీతో చేపపిల్లలు ఇవ్వాలి



గీసుకొండ: చెరువు శిఖం ఆధారంగా గత ప్రభుత్వం వంద శాతం రాయితీతో చేప పిల్లలను పంపిణీ చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం 50 శాతం రాయితీతో పంపిణీ చేయాలని నిర్ణయించడం సరికాదని, పాత పద్ధతినే కొనసాగించాలని జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం కార్యవర్గ సభ్యులు తీర్మానించారు. ఈ మేరకు వరంగల్‌లోని మత్స్యశాఖ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సంఘం కార్యవర్గ సమావేశంలో పలు తీర్మానాలు చేశారు. ఉచితంగా చేపపిల్లలు ఇవ్వడం కాకుండా నగదు బదిలీ చేయాలని కోరారు. సంఘం చీఫ్ ప్రమోటర్ చొప్పరి సాంబయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా కార్యదర్శి నీరటి సదానందం, డైరెక్టర్లు పొన్నం మొగిలి, కంబాల కోటి, భేరి రామేశ్వర్, చెవ్వ కాశీనాథం, అల్లాడి నర్సయ్య, దామ సాంబయ్య, చింతకాయల నరేందర్ పాల్గొన్నారు.

నీట మునిగిన ఎడ్ల బండి



సంగెం: ఎడ్లబండి నీటమునిగి ప్రమాదం తప్పింది. వివరాలు ఇలా ఉన్నాయి. మచ్చాపూర్–చెన్నారావుపేట డబుల్ రోడ్డు పనులు చేపట్టారు. ఇందులో భాగంగా కల్వర్టు నిర్మాణం పూర్తి కాకపోవడంతో నార్లవాయి–మొండ్రాయి గ్రామాల మధ్యలో తాత్కాలికంగా నిర్మించిన అప్రోచ్ రోడ్డు ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తెగిపోయింది. దీంతో బస్సులు, ఇతర వాహనాలు, రైతుల ఎడ్లబండ్లు వెళ్లే పరిస్థితి లేక ఇబ్బందులు పడుతున్నారు. మొండ్రాయి గ్రామానికి చెందిన రైతు పొన్నాల మల్లయ్య శనివారం సాయంత్రం ఎడ్లబండితో వ్యవసాయ భూమి వద్దకు వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని చూసి ఎడ్లు బెదిరిపోయాయి. దీంతో అప్రోచ్ రోడ్డు గుంతలో ఎడ్ల బండి దిగబడిపోయింది. స్థానికులు వెంటనే స్పందించి ఎడ్లను కాని నుంచి తప్పించడంతో పెను ప్రమాదం తప్పిపోయింది.



ఏకరూప దుస్తులు.. ఏకదంతుడిని కీర్తిస్తూ నినాదాలు.. నుదుటన బొట్లు.. నిర్విఘ్న గణపతికి నీరాజనాలు. గాల్లోకి ఎగిరే పసుపు కుంకుమలు.. గణనాథుడికి ఘనమైన ఊరేగింపులు. నిమజ్జన శోభాయాత్ర అంటే కన్నుల పండుగ. ఆ ఉత్సవంలో కీలకపాత్ర దరువులదే. మోత మోగితే కాలు కదలాల్సిందే. స్టెప్పులద రాల్సిందే..

మోత మోగాలె.. స్టెప్పులదరాలె!

గణేశ్ నిమజ్జనంలో డప్పుల దరువుకు దద్దరిల్లాల్సిందే..

సండే స్పెషల్

- ఈసారి డీజేలను నిషేధించిన రాష్ట్ర ప్రభుత్వం
- బ్యాండ్, డప్పు కళాకారులకు పెరిగిన డిమాండ్
- ముందస్తుగానే ఒప్పందం చేసుకున్న ఉత్సవ కమిటీ సభ్యులు
- కళాకారులకు ఒక్కరోజు చేతినిండా పని
- సోమవారం గణేశ్ నిమజ్జనం

సాక్షి, మహబూబాబాద్: గణేశ్ నిమజ్జన శోభాయాత్ర అంటేనే కోలాహలం.. ఓ వైపు ఈలలు.. గణపతి బప్పా మోరియా అంటూ నినాదాలు.. మరోవైపు 'భయ్యా ఔర్ ఏక్ బార్' అంటూ.. డప్పుల మోతకు లయబద్ధంగా స్టెప్పులు వేస్తూ ముందుకు సాగుతుంటారు భక్తులు. నవరాత్రి ఉత్సవాలకు క్రేజ్ పెరిగిన తర్వాత ఇప్పుడు గల్లీకో గణనాథుడు కొలువయ్యాడు. గతేడాది వరకు శోభాయాత్రలో డీజే పెట్టి చిందులు వేస్తూ వెళ్లేవారు. కానీ, ప్రభుత్వం సోమవారం నిర్వహించే నిమజ్జనోత్సవానికి డీజేలు నిషేధించడంతో అందరి దృష్టి డోలు వాయిద్యాలపై పడింది. దీంతో కళాకారులు అందివచ్చిన ఒక్కరోజు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.

బ్యాండ్ కళాకారులకు పెరిగిన డిమాండ్

మారుతున్న కాలంతోపాటు రకరకాల సౌండ్ సిస్టమ్స్ రావడంతో సన్నాయి, తర్వాత బ్యాండ్ మేళానికి ఆదరణ తగ్గింది. గతంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వెయ్యికిపైగా బ్యాండ్ గ్రూపుల ద్వారా వేలాది మందికి ఉపాధి దొరికేది. కానీ.. డిమాండ్ తగ్గడంతో ఇవి కాస్త సగానికి పడిపోయాయి. ప్రభుత్వం వినాయక నిమజ్జనానికి డీజేలు నిషేధించింది. దీంతో బ్యాండ్ కళాకారులకు మళ్లీ డిమాండ్ పెరిగింది. సాధారణ రోజుల్లో 12 మంది ఉండే టీం ఒక ఊరేగింపునకు రావాలంటే రూ.10 వేల వరకు తీసుకునే వారు. కానీ.. ఇప్పుడు ఈ 12 మంది వచ్చి వాయించాలంటే కనీసం రూ.25 వేలు అడుగుతున్నారు. ఒక గ్రామంలో పదుల సంఖ్యలో వినాయక ప్రతిమలు, ఒకటి, రెండు బ్యాండ్ టీమ్స్ ఉండడంతో ఉన్నవారినే కుదించి రేటు మాట్లాడుకుంటున్నారు. ఇలా నలుగురు వాయిద్య కళాకారులు వస్తే కనీసం రూ.10 వేలకు తగ్గకుండా తీసుకుంటున్నారు. వరంగల్ నగరంలాంటి చోట్ల అయితే ఇంకా డిమాండ్ ఎక్కువ. అంత ఖర్చుపెట్టలేని ఉత్సవ కమిటీలు చిన్నపాటి సౌండ్ బాక్సులతో శోభాయాత్ర ముగించాలని చూస్తున్నాయి.

కోలాటాలతో కోలాహలం

డప్పు కళాకారులు దొరకని వారు మహిళలతో కోలాటాలు వేయించేందుకు ప్లాన్ చేసుకుంటున్నారు. గ్రామాలు, పట్టణాల్లో కోలాట బృందాలు ఏర్పడ్డాయి. ఒక్కో బృందంలో సుమారు 15 నుంచి 20 మంది సభ్యులు ఉంటున్నారు. వీరికి ఉత్సవ కమిటీ వారు పారితోషికంగా కొంత మొత్తం నగదు ఇచ్చి రప్పించుకుంటున్నారు. మైకులు పెట్టి పాటలకు అనుగుణంగా కోలాటమాడుతూ గణపయ్యను సాగనంపుతున్నారు. ఒకే రకమైన వస్త్రాలు ధరించి కనిపించే వీరు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నారు.



గతేడాది వినాయక నిమజ్జనంలో కోలాటం వేస్తున్న కళాకారులు

నృత్యాలతో జోష్

రంగుల దుస్తులు, కుంకుమ, రంగులు పూసుకుంటూ.. వెనుక వినాయకుడు రాగా.. ముందు ఆడా, మగ తేడా లేకుండా డ్యాన్సులు చేయడం, ప్రధానంగా తీన్మార్ దెబ్బలకు స్టెప్పులు వేయడంతో జోష్ నిండుతుంది. అందుకోసం బ్యాండ్‌లో కార్నేటు, కిలానెట్, ఇతర వాయిద్యాల కన్నా షేరీలు (పెద్ద డోలు), తాల్సా (చిన్న డోలు) పరికరాలే కీలకం. ఇలా తీన్మార్.. ఏక్‌బార్ అంటూ వాయిద్యాలకు అనుగుణంగా డ్యాన్సులు చేస్తూ వినాయకుడి ఊరేగింపులో హంగామా చేయనున్నారు.





డిమాండ్ బాగా ఉంది..

ప్రభుత్వం డీజేలపై నిషేధం విధించడంతో బ్యాండులకు ఆర్డర్లు బాగా వస్తున్నాయి. నిమజ్జనం రోజు తొర్రూరులో మూడు, నాలుగు గణపతి మండపాల దగ్గర బ్యాండ్ వాయించేందుకు ఆర్డర్ వచ్చింది. మా దగ్గర సరిపడా బ్యాండులున్నాయి. ఒక్కోసారి మనుషులు సరిపోకపోతే పక్క మండలం నుంచి తీసుకొచ్చి బ్యాండ్ వాయిస్తాం.

– ఎస్కే పాషా, బ్యాండ్ నిర్వాహకుడు, తొర్రూరు



నిమజ్జనం రోజే డిమాండ్

మాది 12 మంది గ్రూపు. సాధారణ రోజుల్లో కార్యక్రమాలకు డబ్బులు ఎక్కువ డిమాండ్ చేయం. కానీ.. వినాయకుడి నిమజ్జనం రోజు మాత్రం డిమాండ్ ఉంటుంది. కాబట్టి అందరం ఒకే చోటుకే కాకుండా నలుగురు, నలుగురు గ్రూపుగా వెళ్తాం. ఒక్కో నిమజ్జనానికి రూ.10 వేల నుంచి రూ.15 వేలు తీసుకుంటాం.

– ఎరనాగి వీరన్న, నర్సింహులపేట



ఇప్పుడే కాసిన్ని డబ్బులొస్తాయి..

ఒకప్పుడు బ్యాండ్ మేళం వాయించే వాళ్లంటే డిమాండ్ ఉండేది. కానీ.. డీజేలు వచ్చి మాకు ఉపాధి లేకుండా పోయింది. వినాయకుడి నిమజ్జనం సమయంలో కాసిన్ని పైసలు కన్పిస్తాయి. అయితే ఇది ఒక్కరోజుతోనే అయిపోతుంది. తర్వాత మళ్లీ ఇబ్బందే. మాకు ఉపాధి కల్పించాలి.

– పెద్దమాముల రాజశేఖర్, మహబూబాబాద్

17న జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల ప్రారంభం



జిల్లా ఆస్పత్రిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, కలెక్టర్ సత్య శారద

సాక్షి, వరంగల్: నర్సంపేటలోని జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల ప్రారంభోత్సవాలకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సత్య శారద, ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాలను శనివారం వారు పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి మాట్లాడుతూ.ఈ నెల 17న జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాల ప్రారంభానికి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మంత్రులు కొండా సురేఖ, సీతక్క రానున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఏర్పాటు చేస్తున్న 8 నూతన వైద్యకళాశాల్లో నర్సంపేటకు మాత్రమే అవకాశం వచ్చిందన్నారు. కలెక్టర్ సత్య శారద మాట్లాడుతూ ఎలాంటి లోటుపాట్లు లేకుండా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. జిల్లా ఆస్పత్రి, వైద్య కళాశాలలో ఏర్పాటు చేయనున్న మహిళా శక్తి క్యాంటీన్‌లోని ఆహారపదార్థాలను ఎమ్మెల్యే, కలెక్టర్, డీఆర్‌డీఓ కౌసల్యాదేవి పరిశీలించారు. అనంతరం భోజనం తిని సంతృప్తి వ్యక్తం చేశారు. రోగులు, కళాశాలకు వచ్చేవారికి సైతం నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, ఆర్డీఓ కృష్ణవేణి, డీసీపీ రవీందర్, డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, ఎన్పీడీసీఎల్ ఎస్ఈ మధుసూదన్‌రావు, జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి పుష్పలత, జెడ్పీ సీఈఓ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు మద్యం దుకాణాలు బంద్

వరంగల్ క్రైం: వినాయక నిమజ్జనం సందర్భంగా ఈనెల 16న వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మద్యం దుకాణాలు బంద్ పాటించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. సోమవారం ఉదయం 6 గంటల నుంచి మంగళవారం ఉదయం 6 గంటల వరకు మద్యం దుకాణాలు, బార్ అండ్ రెస్టారెంట్లు, క్లబ్‌లు, హోటళ్లు(మద్యం లభ్యమయ్యేవి) మూసేయాలని సీపీ ఆదేశించారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం నిర్వహించాలని పిలుపునిచ్చారు. మద్యం దుకాణాలు తెరిస్తే చట్టపరమైన చర్యలుంటాయని ఆయన హెచ్చరించారు.

అభివృద్ధిలో ప్రత్యేక అధికారుల పాత్ర కీలకం

- కలెక్టర్ డాక్టర్ సత్య శారద

వరంగల్: గ్రామ పంచాయతీల అభివృద్ధిలో ప్రత్యేక అధికారుల పాత్ర కీలకమని కలెక్టర్ డాక్టర్ సత్య శారద అన్నారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సీఈఓ రాంరెడ్డితో కలిసి మండల పరిషత్, గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులతో కలెక్టర్ శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రత్యేక అధికారులు జవాబుదారీతనంతో వ్యవహరించాలని, నూతన పంచాయతీరాజ్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వర్షాకాలం దృష్ట్యా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలని, గ్రామపంచాయతీల్లో సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. పంచాయతీ ఎన్నికలు జరిగేవరకు ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఇంజనీరింగ్ విభాగం అధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. గ్రామాల్లో పిచ్చి మొక్కలు తొలగించాలని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ సీఈఓ వసుమతి, సూపరింటెండెంట్ ఉదయభాస్కర్, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సత్య శారద

జిల్లాలో 3,88,903 మంది ఓటర్లు

వరంగల్: జిల్లాలోని 11 గ్రామీణ మండలాలు, 325 గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న 2,828 వార్డుల్లో 3,88,903 మంది ఓటర్లు ఉన్నట్లు జిల్లా పరిషత్ ప్రత్యేక అధికారి, కలెక్టర్ సత్య శారద వెల్లడించారు. శనివారం జెడ్పీలో ప్రత్యేక అధికారులతో జరిగిన సమావేశంలో ఓటర్ల జాబితాను ప్రకటించారు. మండలాలు, గ్రామ పంచాయతీలు, వార్డుల వారీగా వివరాలు ఇలా ఉన్నాయి.

మండలం	జీపీలు	వార్డులు	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
చెన్నారావుపేట	30	258	15,606	15,894	1	31,501
దుగ్గొండి	34	282	18,096	18,676	0	36,772
గీసుకొండ	21	188	13,768	14,563	0	28,331
ఖానాపురం	21	184	13,533	14,231	4	27,768
నల్లబెల్లి	29	252	15,153	15,778	0	30,931
నర్సంపేట	27	238	16,229	16,984	0	33,213
నెక్కొండ	39	340	22,404	23,230	2	45,636
పర్వతగిరి	33	288	19,514	19,628	0	39,142
రాయపర్తి	40	342	22,535	23,021	1	45,557
సంగెం	33	286	20,169	20,998	1	41,168
వర్ధన్నపేట	18	170	14,149	14,735	0	28,884
మొత్తం	325	2,828	1,91,156	1,97,738	9	3,88,903

సమస్యల పరిష్కారానికి కృషి

వర్ధన్నపేట: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషిచేయనున్నట్లు పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు ఈదునూరి రవీందర్‌రెడ్డి అన్నారు. వర్ధన్నపేట ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వహించిన మండల విస్తృతస్థాయి సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో ఏకీకృత సర్వీస్ రూల్స్ సాధించుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వంతో చర్చలు జరిపి హెల్త్ కార్డులు, పెండింగ్ డీఏలు, కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం వంటి సమస్యలు పరిష్కరించుకుంటామని చెప్పారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడిగా నిమ్మ మనుజేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా వెంగళ అశోక్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా తమ్మి దయాకర్, ఉపాధ్యక్షుడిగా బొమ్మినేని జితేందర్ రెడ్డి, మహిళా ఉపాధ్యక్షురాలిగా కూరాకుల సుజాత, కార్యదర్శిగా ధార భవాని, కార్యదర్శిగా ఇ.స్వప్నను ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా రవీందర్, రఘు, నితిన్‌రెడ్డిని వ్యవహరించారు.

నీరు నిల్వ లేకుండా చూడాలి

- పంటల్లో యాజమాన్య పద్ధతులు పాటించాలి
- సస్యరక్షణ చర్యలు తీసుకుంటే అధిక దిగుబడి
- 'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.అనురాధ
- సందేహాలను నివృత్తి చేసుకున్న రైతులు



'సాక్షి' ఫోన్‌ఇన్ కార్యక్రమంలో మాట్లాడుతున్న డీఏఓ కె.అనురాధ

ఖిలా వరంగల్: భారీ వర్షాలతో పంటలు దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారు.. ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పట్టడంతో పంటల్లో నీరు నిల్వ లేకుండా చూడాలి.. సస్యరక్షణ చర్యలు తీసుకుంటే ఆశించిన దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయాధికారి కె.అనురాధ సూచించారు. పంటల్లో తెగుళ్ల నివారణ, యాజమాన్య పద్ధతులపై శనివారం 'సాక్షి' ఆధ్వర్యంలో నిర్వహించిన ఫోన్‌ఇన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. జిల్లాలోని పలు ప్రాంతాల రైతులు ఫోన్‌చేసి తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. రైతుల ప్రశ్నలకు జిల్లా వ్యవసాయాధికారి సమాధానాలు ఇచ్చారు.

ప్రశ్న: అధిక వర్షాలతో మిర్చి పంటలో ఆకులు ఎర్రగా మారుతున్నాయి. నివారణ చర్యలు ఏమిటి?

– పుచ్చకాయల కృష్ణారెడ్డి, నాచినపల్లి, దుగ్గొండి, లావుడ్యా లక్‌పతి, లావుడ్యా తండా, నెక్కొండ

జవాబు: మిర్చి పంటలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. ఎకరాకు దైతన్యం 45 లేదా మ్యాంకో జబ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి మొదళ్లు బాగా తడిసేలా పిచికారీ చేయాలి. పంటలో పదును ఉంటే 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ కలిపి చల్లాలి. దీంతో ఆకుల ఎరుపు రంగు పోయి మొక్క ఆరోగ్యంగా ఎదుగుతుంది.

ప్రశ్న: మిర్చి మొక్కలు ఎండిపోతున్నాయి. దీనికి పరిష్కార మార్గం చెప్పండి?

–తోటకూరి రాజు, తిమ్మంపేట, దుగ్గొండి , సంగడి వీరన్న చంద్రుగొండ, నెక్కొండ

జవాబు: మిర్చి పంటలోని నీటిని తీసివేయాలి. లీటరు నీటిలో 10 గ్రాముల పాలీఫీడ్ (19,19,19) లేదా మల్టీ–కే (13.0.45) లేదా ఫార్ములా–4 అరకిలో చొప్పున కలిపి మొక్క తడిచేలా పిచికారీ చేయాలి. పైపాటుగా 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలి.

ప్రశ్న: పత్తిలో పచ్చ, తెల్లదోమ, తామర పురుగు, ఆకు ముడత వ్యాపించింది. దీంతో ఆకులు వాడిపోతున్నాయి. నివారణ చర్యలు వివరించండి?

– రంగు వెంకటేశ్వర్లు, మండపల్లి, బొట్ల నరేశ్, మైసంపల్లి, దుగ్గొండి మండలం, రాయినేని రాజేశం ,అప్పల్‌రావుపేట, నెక్కొండ మండలం

జవాబు : పత్తిలో పచ్చ, తెల్లదోమ, తామర పురుగు నివారణకు ఎకరానికి 60 మిల్లీలీటర్ల ఉలాలా 20 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. దీంతో ఆకు ముడత కూడా తగ్గి మొక్క ఆరోగ్యంగా ఎదుగుతుంది. లీటరు నీటిలో 5 మిల్లీగ్రాములు టెట్రానిలిపోల్‌తోపాటు 19,19,19, మ్యాక్రోన్యూట్రిషన్‌ను కలిపి పిచికారీ చేస్తే ఆకులు వాడిపోకుండా ఉంటాయి.

ప్రశ్న : వరిలో మొగి పురుగు నివారణకు ఏ మందు పిచికారీ చేయాలి?

– పండి వెంకన్న, రెడ్లవాడ, నెక్కొండ మండలం

జవాబు: ఎకరాకు 100 మిల్లీగ్రాముల టెట్రానిలిపోల్‌ను 20 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేస్తే మొగి పురుగు తగ్గుతుంది.

ప్రశ్న: పత్తిలో పూత, కాత రాలిపోతుంది. ముందస్తుగా ఏమందు పిచికారీ చేయాలి?

– పూత రాజు, మామిండ్లవీరయ్యపల్లి, నల్లబెల్లి మండలం, దొంగరి సతీశ్, జక్కుల రవి చంద్రుగొండ, యాసిన్ కుమార్ అప్పల్‌రావుపేట

జవాబు: ప్లానాఫిక్స్ ఒక మిల్లీలీటరు మందును 5 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ప్రశ్న : పత్తిలో ఎండు తెగులు నివారణ చర్యలు వివరించండి?

– గోనె రాజు, గిర్నిబావి, దుగ్గొండి మండలం, మామిండ్ల అయిలయ్య, లెంకాలపల్లి, నల్లబెల్లి మండలం, వర్ల కుమారస్వామి, కొత్తూరు, ఖానాపురం మండలం, మూల రవి, అప్పల్‌రావుపేట, నెక్కొండ

జవాబు: నత్రజని లోపంతో ఇలాంటి తెగులు సోకుతుంది. నివారణకు కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా బ్లైటాక్స్ మందు లీటరు నీటిలో కలిపి మొక్క మొదళ్లలో పోయాలి. పైపాటుగా 10 గ్రాముల పాలీఫీడ్ (19,19,19) లేదా మల్టీ–కే (13,0.45) పోషకాలను వారంలో రెండుసార్లు పిచికారీ చేస్తే మిర్చి, పత్తిలో ఎండు తెగులు నివారించవచ్చు. మిర్చిలో ఆకు ముడత నివారణకు ఫిప్రొనిల్ మందు పిచికారీ చేయాలి.

ప్రశ్న : వరి ఏపుగా పెరగాలంటే ఏ మందు వాడాలి?

– భట్టు లక్ష్మణ్, రెడ్లవాడ, నెక్కొండ మండలం, తొగర్లపల్లి వీరస్వామి, వెంకటాపురం, దుగ్గొండి

జవాబు: ఎకరానికి 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేస్తే వరి ఏపుగా పెరుగుతుంది.

ప్రశ్న : అధిక వర్షాలతో పత్తి ఎర్రబడింది. మొక్క ఎదగడానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి.?

– సంగి కట్టయ్య, రెడ్లవాడ, నెక్కొండ మండలం

జవాబు: పత్తిలో నీరు నిల్వలేకుండా చూసుకోవాలి. ఎర్ర తెగులు నుంచి బయటపడేందుకు 25 కిలోల యూరియా, 10 కిలోల పొటాష్ వేయాలి. పైపాటుగా మల్టీ–కే లేదా 19,191,19 మ్యాక్రో న్యూట్రిషన్‌ను కలిపి పిచికారీ చేస్తే సరిపోతుంది.

ప్రశ్న: మొక్కజొన్నలో అంతర పంటగా వేసిన దేశవాళి చిక్కుడు పసుపు రంగులో మారింది. ఎలాంటి చర్యలు తీసుకోవాలి?

– వద్ది రాజు, కొనాయమాకుల,గీసుగొండ

జవాబు: మొజాయిక్ వైరస్‌తో చిక్కుడు పసుపు రంగులోకి మారింది. దీని నివారణకు ప్లానికామిడ్ 80 మిల్లీలీటర్లు, ఇమిడాకో ప్రిడ్ 100 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

ప్రశ్న: చవుడు నేలలో వేసిన వరి పంట పసుపు రంగులోకి మారింది. నివారణ చర్యలు ఏమిటి?

– నేతం రాజు, నల్లబెల్లి, సంగెం మండలం

జవాబు: చవుడు నేలలో వేసిన వరి పంట పసుపు రంగులోకి మారితే జింక్ సల్ఫేట్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. లేదా ప్లోనికామిడ్ 80 మిల్లీలీటర్లు, ఇమిడాకోప్రిడ్ 100 మిల్లీలీటర్లు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

దరఖాస్తుల ఆహ్వానం

నల్లబెల్లి: అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ జ్ఞాపకార్థం అందించనున్న అవార్డుల కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ దళిత విద్యావంతుల వేదిక జిల్లా కార్యదర్శి భట్టు సాంబయ్య ఒక ప్రకటనలో తెలిపారు. పర్యావరణ విద్య, సామాజిక సేవా, కళారంగాల్లో విశిష్ట సేవలందించి ఆసక్తి కలిగిన వారు ఈ నెల 30లోపు దరఖాస్తులు అందజేయాలని కోరారు. భట్టు సాంబయ్య, ఇంటి నంబర్ 1–83, పోస్టు రంగాపురం, మండలం నల్లబెల్లి, జిల్లా వరంగల్–506350 చిరునామాకు పంపించాలని పేర్కొన్నారు. అవార్డులకు ఎంపికైన వారికి నగదు బహుమతి, జ్ఞాపిక అందిస్తామని తెలిపారు.

ఎండు గంజాయి స్వాధీనం

● ఇద్దరిపై కేసు నమోదు..అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నెల్లికుదురు : బైక్‌పై అక్రమంగా ఎండు గంజాయి తీసుకెళ్తున్న ఇద్దరిని పట్టుకుని గంజాయితోపాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేసి నిందితులను అరెస్టు చేసినట్లు తొర్రూర్ సీఐ కె.జగదీశ్ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో సీఐ వివరాలు వెల్లడించారు. మహబూబాబాద్ నుంచి నెల్లికుదురు మీదుగా హైదరాబాద్‌కు బైక్‌పై ఎండు గంజాయి అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందినట్లు తెలిపారు. ఎస్సై చిర్ర రమేశ్ బాబు తన సిబ్బందితో మండల కేంద్రంలోని క్రాస్ రోడ్ వద్ద వాహనాలను తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరిని ఎస్సై తనిఖీ చేశారు. కాగా రూ.1.26 లక్షల విలువ చేసే దాదాపు 5కిలోల ఎండు గంజాయిని అనుమానం రాకుండా బైక్ సీటులో ప్యాకింగ్ చేసి అక్రమంగా రవాణా చేస్తున్నట్లు గమనించామన్నారు. ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా ఒడిశా రాష్ట్రం, మల్కాజిగిరి జిల్లా నీలికాంబరి మండలంలోని ఓరికల్ పోలీస్‌స్టేషన్ పరిధి చిమిటపల్లి గ్రామానికి చెందిన నరేంద్ర కైలా, బాపన్ రాయ్‌లుగా గుర్తించామన్నారు. ఎండు గంజాయిని స్వాధీనం చేసుకుని బైక్‌ను సీజ్ చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎస్సై చిర్ర రమేశ్ బాబు, పోలీస్ సిబ్బందిని ఎస్పీ సుధీర్ రాంనాథ్ కేకన్ అభినదించినట్లు సీఐ తెలిపారు.

ఖిలా వరంగల్‌లో 2 కిలోలు..

ఖిలా వరంగల్ : ఇంట్లో నిల్వ చేసి అమ్మకానికి సిద్ధం చేసిన రూ.50వేల విలువైన 2కేజీల ఎండు గంజాయిని స్వాధీనం చేసుకొని నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. ఖిలా వరంగల్ పడమరకోటకు చెందిన పసునూటి నాగరాజు మార్కెట్లో గుమస్తాగా పనిచేస్తున్నాడు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలని నాగరాజు నమ్ముతాడు. ఈ క్రమంలో సీలేరుకు వెళ్లి అక్కడ నవీన్ అనే వ్యక్తి వద్ద 2కేజీల 100 గ్రాముల ఎండు గంజాయిని కొనుగోలు చేసి పడమరకోటలోని తన ఇంట్లో నిల్వ చేసినట్లు ఏసీపీ నందిరాంనాయక్‌కు సమాచారం అందింది. దీంతో మిల్స్‌కాలనీ ఎస్సై సురేష్ ఆధ్వర్యంలో పడమరకోటలోని నాగరాజు ఇంటిపై ఆకస్మికంగా దాడి చేశారు. ఇంట్లో దాచిన గంజాయిని స్వాధీనం చేసుకొని అతడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
Cell: 9989299661

కవచం.. కాటమయ్య కిట్

● తాటిచెట్లుపై గీతకార్మికుల ప్రమాద నివారణకు చెక్
● బీసీ వెల్ఫేర్, ఎక్సైజ్ శాఖల సమన్వయంతో శిక్షణ

కాజీపేట అర్బన్ : కులవృత్తిలో భాగంగా తాటిచెట్టు ఎక్కి కల్లు గీయడమంటే గీతకార్మికలకు రోజు కత్తిమీద సాములాంటిదే. కాస్త ఏమరపాటుగా ఉన్నా చెట్టు నుంచి జారిపడి ప్రాణాలు కోల్పోవడం, అంగవైకల్యానికి గురవడం ఖాయం.. ఆధునిక, సాంకేతిక రంగాలు అభివృద్ధి చెందుతున్న నేటి కాలంలో నాటి మోకు, ముస్తాద్‌తోనే తాటిచెట్టు ఎక్కి కల్లు సేకరిస్తు జీవనోపాధి పొందుతున్నారు. దీంతో తాటిచెట్టుపై జరిగే ప్రమాదాలను చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కాటమ్మయ్య రక్షణ కిట్‌లను గీతకార్మికులకు ఉచితంగా అందజేస్తోంది.

ఉచితంగా కిట్ అందజేత..

తాటిచెట్టు నుంచి కల్లు గీసేందుకు గీతకార్మికులు నేటికి తమ కులవృత్తిపైనే ఆధారపడుతున్నారు. ఇందులో భాగంగా తాటిచెట్టు ఎక్కేందుకు మోఖు, ముస్తాదు ధరిస్తున్నారు. ఈ క్రమంలో కాస్తా ఏమరపాటుకు లోనైనా.. వానాకాలంలో చెట్టుపై నుంచి జారినా.. గీతకార్మికులు ప్రమాదానికి గురి కావాలిందే. కొన్ని సంఘటనల్లో వారు ప్రాణాలు సైతం కోల్పోతుంటారు. అలాగే కాళ్లు, చేతులు, నడుము విరగడంతో అంగవైకల్యం బారిన పడుతున్నారు. దీంతో గీతకార్మికుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం కాటమయ్య రక్షణ కిట్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. ఈ రక్షణ కిట్‌లో గీతకార్మికులు ధరించే మోఖు, ముస్తాదుతో ఏర్పాటు చేసిన ప్రత్యేక తాడును గీతకార్మికుడిని పట్టుకుని ఉంటుంది. దీంతో తాటిచెట్టు ఎక్కే సమయంలో కాళ్లు జారడం, బీపీ, గుండెపోటు వంటి ప్రమాదాల నుంచి కింద పడిపోకుండా చెట్టుపైనే సురక్షితంగా ఉండేందుకు లాక్ చేసి కిందికి పడకుండా తోడ్పడుతుంది. సుమారు 300కిలోల బరువును మోసే విధంగా రక్షణ కిట్‌ను రూపొందించారు. కిట్ ధర సుమారు రూ.15వేల వరకు ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం గీతకార్మికులకు ఉచితంగానే అందజేస్తోంది.



కాటమయ్య రక్షణ కిట్

బీసీ వెల్ఫేర్, ఎక్సైజ్ శాఖ సమన్వయంతో..

ప్రభుత్వం అందజేస్తున్న కాటమయ్య రక్షణ కిట్ల వినియోగంపై బీసీ వెల్ఫేర్, ఎక్సైజ్ శాఖ సమన్వయంతో శిక్షణ ఇస్తోంది. మొదట ఈనెల 13వ తేదీన జిల్లాలోని కాజీపేట మండలంలో గల మడికొండ ఎల్లమ్మగుడి వద్ద ఉన్న తాటివనంలో, హుజురాబాద్, పరకాలలోని తాటి వనంలో హైదరాబాద్ నుంచి వచ్చిన నిపుణుల బృందంతో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. త్వరలో ప్రతి గ్రామంలో శిక్షణ కార్యక్రమాలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సమాయత్తం అవుతోంది.



కిట్ వినియోగంపై శిక్షణ ఇస్తున్న అధికారులు

సభ్యత్వం ఉన్న గీతకార్మికులకు..



ఎక్సైజ్ శాఖ, గీతకార్మిక సంఘంలో సభ్యత్వం ఉన్న ప్రతి గీతకార్మికుడికి కాటమయ్య రక్షణ కిట్లను అందజేస్తాం. సభ్యత్వ నమోదు ఐడీ కార్డు లేని వారు తాటిచెట్టు ఎక్కగల వారికి సైతం కిట్లను ఇస్తాం. తాటిచెట్టు ఎక్కే గీతకార్మికుల ప్రమాదాల నివారణకు అవగాహన కల్పిస్తున్నాం. గీతకార్మికులు శిక్షణలో పాల్గొని కిట్‌లను తప్పకుండా వినియోగించుకోవాలి.

- వేముల చంద్రమోహన్, ఎక్సైజ్ సీఐ, కాజీపేట

చెట్టు ఎక్కేందుకు అనువుగా ఉంది



కులవృత్తిని ధైర్యంగా కొనసాగించేందుకు మాకు కాటమయ్య రక్షణ కిట్ అనువుగా ఉంది. తాటిచెట్టు ఎక్కాలంటే ఎంతో ధైర్యం కావాలి.. కాసింత ఏమరపాటుగా ఉంటే జారిపడే అవకాశం ఉంది. ఇప్పుడు ప్రభుత్వం అందజేస్తున్న కాటమయ్య రక్షణ కిట్ ధరించడంతో ప్రమాదాల బారినపడకుండా సురక్షితంగా చెట్టు ఎక్కే అవకాశం ఉంది.

- తాళ్లపల్లి వెంకటనారాయణ గౌడ్, ఐనవోలు

వేర్వేరు కారణాలతో ఇద్దరి ఆత్మహత్య

మనస్తాపంతో యువతి..



తులసి (ఫైల్)

మరిపెడ : వివాహ ఖర్చులకు నగదు సమకూరలేదని..ఇక తనకు పెళ్లి కాదని మనస్తాపం చెందిన ఓ యువతి ఆత్మహత్యకు పాల్పడింది. ఎస్సై సంతోష్ తెలిపిన కథనం ప్రకారం..మరిపెడకు చెందిన మద్దెబోయిన తులసి(19) స్థానిక బేకరిలో పనిచేస్తుంది. ఈ నేపథ్యంలో ఆమెకు ఇటీవల పెళ్లి కుదరగా, నెల రోజుల్లో వివాహం జరగాల్సి ఉంది. పేద కుటుంబం కావడంతో వివాహ ఖర్చులకు డబ్బులు సమకూరవని మనస్తాపానికి గురైంది. దీంతో ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరివేసుకొని శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి తల్లి ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ఏరియా ఆ స్పత్రికి తరలించినట్లు ఎస్సై సంతోష్ పేర్కొన్నారు.

డబ్బులు పోయాయని దూషించగా..

డోర్నకల్ : ఇంట్లోని డబ్బులు పోయాయని పనిమనిషిని యజమాని దూషించడంతో మనస్తాపానికి గురైన వృద్ధురాలు ఆత్మహత్య చేసుకున్న ఘటన డోర్నకల్ మున్సిపల్ పరిధి లచ్చాతండాలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం లచ్చాతండాకు చెందిన తేజావత్ బీబూ (60) డోర్నకల్‌లోని పలు ఇళ్లలో పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. సుభాష్‌వీధికి చెందిన రాజేశ్ ఇంట్లో పనిమనిషిగా పనులు చేస్తున్న క్రమంలో రెండ్రోజుల క్రితం ఇంట్లో రూ.15 వేలు పోయాయంటూ రాజేశ్ బీబూను దూషించి చేయి చేసుకున్నాడు. దీంతో మనస్తాపానికి గురైన బీబూ శుక్రవారం తన ఇంట్లో గడ్డి మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. వెంటనే బీబూ కుమారుడు రమేశ్ ఖమ్మంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం రాత్రి మృతి చెందింది. మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వంశీధర్ పేర్కొన్నారు.

ఫోన్‌పే చేస్తే పౌండ్స్ ఇస్తా..

● లక్ష కాజేసిన ఘనుడు

ఖిలా వరంగల్ : లండన్‌లో చదువుకుంటున్న కుమార్తెకు ఫోన్ పే చేస్తే పౌండ్స్‌గా మార్చేసి ఇస్తానని ఓ వ్యక్తిని నమ్మించి రూ.లక్ష కాజేసినట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు. శనివారం మల్లయ్య తెలిపిన కథనం ప్రకారం..వరంగల్ ఫోర్ట్‌రోడ్డు శివనగర్‌కు చెందిన ఎరుకుల ముక్తేశ్వర్ కుమార్తె శ్వేత యూకేలో ఉంటూ చదువుతోంది. అయితే తనకు రూ.లక్ష కావాలని కూతురు శ్వేత తన తండ్రిని అడిగింది. దీంతో లండన్ వాట్సాప్ గ్రూపులోని 98914 51631 నంబర్‌కు సంప్రదిస్తే వీరభద్రరావు అనే వ్యక్తి తనకు ఫోన్ పే చేస్తే పౌండ్స్‌గా మార్చేసి నీ బిడ్డకు ఇస్తానని నమ్మబలికాడు. అలాగే తన వాట్సాప్ నంబర్‌కు రూ.1లక్ష పే చేయమన్నాడు. ఫోన్‌పేలో నగదు చేరిన నిమిషం నుంచి వీరభద్రరావు ఫోన్ స్విచ్ ఆఫ్ చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ మల్లయ్య తెలిపారు.

రెండో ఆర్మీగా.. ఎన్‌సీసీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్.కే భద్ర



ఎన్‌సీసీ కేడెట్లతో ఆఫీసర్లు

● కమాండెంట్ కల్నల్ ఎస్.కే భద్ర
● ఎన్‌సీసీ శిక్షణతో క్రమశిక్షణ

కేయూ క్యాంపస్ : రెండో ఆర్మీగా ఎన్‌సీసీ పరిగణించబడుతుందని ఎన్‌సీసీతో కేడెట్లకు క్రమశిక్షణపాటు శారీరక, మానసిక ఆరోగ్యం కూడా లభిస్తుందని ఎన్‌సీసీ క్యాంపు కమాండెంట్ కల్నల్ ఎస్.కే భద్ర తెలిపారు. ఎన్‌సీసీ 11వ తెలంగాణ బెటాలియన్ ఖమ్మం ఆధ్వర్యంలో కాకతీయ యూనివర్సిటీలో ఈనెల 6న ప్రారంభమైన ఎన్‌సీసీ క్యాంపు శనివారం ముగిసింది. కేయూలోని ఆడిటోరియంలో నిర్వహించిన ముగింపు సమావేశంలో ఎస్.కే భద్ర పాల్గొని మాట్లాడారు. ఎన్‌సీసీలో సుమారు 15లక్షల మంది విద్యార్థులు కేడెట్లుగా ఉన్నారన్నారు. ఎన్‌సీసీ ద్వారా శిక్షణతో పాటు సర్టిఫికెట్లు ఇస్తారని తెలిపారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమాండెంట్ లెఫ్టినెంట్ కల్నల్ నవీన్‌యాదవ్ మాట్లాడుతూ.. క్యాంపులో నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. ఇందులో ప్రధానంగా ఎన్‌సీసీ కేడెట్లకు ఫైరింగ్‌తో పాటు సెక్షన్ ఫార్మషన్ డ్రిల్, గేమ్ అండ్ స్పోర్ట్స్ కల్చరల్ యాక్టివిటీస్‌పై శిక్షణ ఇచ్చామని వెల్లడించారు. ముగింపు సమావేశంలో ఎన్‌సీసీ ఆఫీసర్స్ లెఫ్టినెంట్ డాక్టర్ ఓ ంకార్, ప్రభాకర్, జీవన్ కుమార్, శ్రీనివాస్, కలీలుద్దీన్, ప్రభాకర్‌రావు, శంకర్, శేఖర్, సుబేదార్ మేజర్ లలిత్ సింగ్, ట్రెయినింగ్ జేసీఓ రాజారాం, కాకతీయ యూనివర్సిటీ అధికారులు రాజ్‌కుమార్, వెంకయ్య, వాసుదేవ రెడ్డి, ఎన్‌సీసీ కేడెట్లు పాల్గొన్నారు.

భవిష్యత్ ప్రణాళికను నిర్ణయించుకోండి

● సెయింట్ పీటర్స్ విద్యాసంస్థల డైరెక్టర్ ఎన్.నారాయణరెడ్డి
● సీజేఐటీలో 23వ గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ పట్టాలు అందజేస్తున్న అతిథులు

జనగామ : ఇంజనీరింగ్ పట్టా పొందిన విద్యార్థులు భవిష్యత్ ప్రణాళికను నిర్ణయించుకోవాలని సెయింట్ పీటర్స్ విద్యాసంస్థల డైరెక్టర్ ఎన్.నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. యశ్వంతాపూర్‌లోని క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల 23వ గ్రాడ్యుయేషన్ డే సందర్భంగా శనివారం కళాశాల డైరెక్టర్ విజయపాల్‌రెడ్డి అధ్యక్షతన వేడుకలు నిర్వహించగా ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. ప్రస్తుత సాంకేతిక యుగంలో సమాజంతో పోటీ పడితేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. ప్రత్యేక అతిథి,సెంటిఫిక్ ఆఫ్ టాలెంట్ అక్విజిషన్ హెడ్ నరేన్ రెడ్డి మాట్లాడుతూ దేశ ప్రగతిలో నేటితరం యువత పాత్ర చాలా కీలకమన్నారు.స్కైలెన్‌సీయో ఫౌండర్, సీఈఓ అభిజిత్ మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాల్లో తమ ఉనికిని కాపాడుకున్నప్పుడే భవిష్యత్‌లో ఏరంగంలోనైనా రాణించే అవకాశం ఉంటుందన్నారు. కళాశాల డైరెక్టర్ డి.విజయపాల్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఇంజనీరింగ్ పూర్తి చేసుకుని జీవిత గమ్యంలో తమకంటూ ఓ ప్రత్యేకతను చాటుకోవాలన్నారు. టాపర్‌గా నిలిచిన విద్యార్థులు ఎం.శివరామకృష్ణ(సివిల్), ఎండీ మాజిద్(ఎలక్ట్రికల్), కె.జయంత్ (మెకానికల్), బి.స్వాతి(ఎలక్ట్రానిక్స్), పి.ప్రియ(కంప్యూటర్స్)లను సత్కరించి, గ్రాడ్యుయేషన్ పట్టాలు ఇచ్చి అభినందించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కన్వీనర్ అల్లంకి సన్యాసిరావు, కో కన్వీనర్ ఎండీ ఆజాం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు సీతారాం ఏచూరి

● సంతాప సభలో సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య



సమావేశంలో మాట్లాడుతున్న జి.నాగయ్య

ఖిలా వరంగల్ : పోరాట యోధుడు, సమాజం గర్వించే మహోన్నత వ్యక్తి సీతారాం ఏచూరి అని సీపీఎం కేంద్ర కమిటీ సభ్యుడు జి.నాగయ్య అన్నారు. ఏచూరి మృతి పార్టీకి తీరని లోటని, ఆయన ఆశయాలను పార్టీ శ్రేణులు కొనసాగించాలని నాగయ్య పిలుపునిచ్చారు.ఈమేరకు శనివారం వరంగల్ ఉర్సు గుట్ట సీపీఎం జిల్లా కార్యాలయం రామ సురేందర్ భవనంలో సీపీఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కార్యదర్శి సీహెచ్ రంగయ్య అధ్యక్షతన ఏచూరి సంతాప సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా నాగయ్య హాజరై ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. జేఎన్‌యూ సెంట్రల్ యూనివర్సిటీలో ఎస్ఎఫ్ఐ నుంచి అధ్యక్షుడిగా ఎన్నికై విద్యార్థుల సమస్యలపై అలుపెరగని పోరాటం చేసిన మహనీయుడు ఏచూరి అని కొనియాడారు. ప్రపంచ మేథావిగా గుర్తించబడ్డ గొప్ప వ్యక్తి ఏచూరి అన్ని అన్నారు. చిన్న వయసులోనే భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ కేంద్ర కమిటీ సభ్యుడిగా ఎన్నిక కావడం జరిగిందని గుర్తుచేశారు. సీతారాం మృతి పార్టీకి తీరని లోటని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. పీడిత ప్రజల స్వతంత్రం కోసం సోషలిజాన్ని సాధించాలని అప్పుడే సీతారాం ఏచూరికి నిజమైన నివాళులర్పించడం అని ఆయన పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో కార్యదర్శి వర్గ సభ్యుడు సింగార బాబు, నలిగంటి రత్నమాల, భూక్య సమ్మయ్య, ఈసంపల్లి బాబు, కుమారస్వామి, కార్యకర్తలు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు వృథాకావు

● ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు ఉపేందర్ రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఉపేందర్ రెడ్డి

శాయంపేట : తెలంగాణ సాయుధ పోరాటంలో అమరులైన వీరుల త్యాగాలు వృథా కావని ఎంసీపీఐ(యూ) కేంద్ర కమిటీ సభ్యుడు వల్లెపు ఉపేందర్ రెడ్డి అన్నారు. మండలంలోని ప్రగతిసింగారంలో శనివారం ఆ పార్టీ పరకాల డివిజన్ కార్యదర్శి నీల రవీందర్ అధ్యక్షతన తెలంగాణ సాయుధ పోరాట అమరవీరుల వారోత్సవాల సమావేశం నిర్వహించగా ముఖ్య అతిథిగా ఉపేందర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. వీర తెలంగాణ సాయుధ పోరాటంలో భూస్వాములను, దొరలను గడగడలాడించి ఎర్రజెండా నాయకత్వంలో 10 లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన 5,000మంది మహావీరుల త్యాగాలు చిరస్మరణీయమన్నారు. సెప్టెంబర్ 17న జరిగిన పోరాటం జాగిర్దారులకు, జమీందారులకు, నిజాం రాచరిక వ్యవస్థకు వ్యతిరేకంగా సాగిందన్నారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం, అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కానీ ఆనాటి ప్రజల వీరోచిత చరిత్ర వాస్తవాలను ప్రజలకు తెలియజేయడం లేదన్నారు. నాటి వాస్తవిక ప్రజల వీరోచిత పోరాట చరిత్రను వక్రీకరించే ఈ పాలకవర్గాల పార్టీలను, ప్రభుత్వాలను నాటి పోరాట వారసత్వ చైతన్యంలో ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో జిల్లా కార్యదర్శి ఎస్‌రెడ్డి హంసారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు కూసం బుచ్చయ్య, మంద భద్రయ్య, ఎండీ ఉస్మాన్, వక్కల కిషన్, పెంట తిరుపతి, మహేందర్ రెడ్డి, వెంకట రెడ్డి, శంకర్, సమ్మయ్య, బాబురావు, రంజిత్, లింగస్వామి, రమేష్, రాజయ్య పాల్గొన్నారు.

రైల్వే ఏడీఆర్‌ఎం తనిఖీ

కాజీపేట రూరల్ : కాజీపేట జంక్షన్‌లో సికింద్రాబాద్ డివిజన్ అడిషనల్ రైల్వే మేనేజర్ (ఏడీఆర్ఎం) గోపాల్ శనివారం తనిఖీ చేశారు. నాగపూర్-సికింద్రాబాద్ మధ్య నడిచే వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలు రేపు రాత్రి కాజీపేటలో హాల్ట్ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని పురస్కరించుకోని ఏర్పాట్ల నిమిత్తం గోపాల్ వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు ఏడీఆర్ఎం వందేభారత్ ప్రారంభోత్సవాని కి సబంధించిన ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడి పలు సూచనలు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు.

బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి



రమేశ్ (ఫైల్)

తొర్రూరు : ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనంపై నుంచి పడి యువకుడు మృతిచెందిన సంఘటన తొర్రూరు మున్సిపల్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం..మండలంలోని కంఠాయపాలెం గ్రామానికి చెందిన ఈరబోయిన రమేశ్(30) ఉపాధిహామీ పథకంలో ఫీల్డ్ అసిస్టెంట్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. కాగా శుక్రవారం తొర్రూరుకు వచ్చి పనులు ముగించుకుని తిరిగి రాత్రి బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో పట్టణ శివారులోని మామిడి తోట సమీపంలో రోడ్డుపై పడి ఉన్న పాత పరుపుకు బైక్ తగిలి కింద పడ్డాడు. దీంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు వెంటనే తొర్రూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో ఎంజీఎంకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడికి భార్య రచన, కుమార్తెలు మహాన్విత, ఆరాధ్య ఉన్నారు. మృతుడి బంధువు ఈరబోయిన శ్రీపాల్ ఫిర్యాదు మేరకు మున్సిపాలిటీ సిబ్బందిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ప్రజా సంఘాల ఆందోళన..

తొర్రూరు మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంగా రోడ్డుపై చెత్త వేయడంతోనే రమేశ్ మృతి చెందాడని ఆరోపిస్తూ శనివారం డివిజన్ కేంద్రంలో ప్రజా సంఘాల నాయకులు, గ్రామస్తులు ఆందోళనకు దిగారు. హచ్చుతండా సమీపంలో మున్సిపాలిటీ డంపింగ్ యార్డు ఉన్న కూడా కంఠాయపాలెం రోడ్డులో చెత్త వేయాల్సిన అవసరం ఏం ఉందని, వారి నిర్లక్ష్యం కారణంగానే నిండు ప్రాణం పోయిందని మాజీ జెడ్పీటీసీ మంగళపల్లి శ్రీనివాస్, సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొల్లం అశోక్‌లు ఆరోపించారు. ఈ ఘటనకు మున్సిపాలిటీ అధికారులు పూర్తి బాధ్యత వహించాలని, తక్షణమే బాధ్యులపై చర్య తీసుకోవాలన్నారు. మృతుడి కుటుంబానికి రూ.20 లక్షల పరిహారం, రమేశ్ భార్యకు ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళనలో సీపీఎం, సీపీఐ, బీఆర్ఎస్, కేవీపీఎస్, స్థానికులు పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

విద్యుదాఘాతంతో వ్యక్తి..



అశోక్ (ఫైల్)

రేగొండ(కొత్తపల్లిగోరి) : ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన కొత్తపల్లిగోరి మండలంలోని నిజాంపల్లి గ్రామంలో శనివారం చోటుచేసుకుంది. ఎస్సై సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. నిజాంపల్లికి చెందిన బమ్మ అశోక్ (40) వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. స్నానం చేసి ఇంట్లోని ఇనుప వైరుపై ఉన్న లుంగీ తీసే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై మృతిచెందాడు. మృతుడి భార్య ఉమాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సందీప్‌కుమార్ పేర్కొన్నారు.

రాక్షసపాలన సాగిస్తున్న రేవంత్‌రెడ్డి

● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్ : రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి రాక్షసపాలన కొనసాగిస్తున్నాడని, కాంగ్రెస్ గుండాలను ఉసిగొల్పి దాడులు చేయిస్తున్నాడని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ టి.రాజయ్య ధ్వజమెత్తారు. శనివారం ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజయ్య మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నాడని, కౌశిక్ రెడ్డిని హౌస్ అరెస్ట్ చేయడం, అరికెపూడి గాంధీకి పోలీసు ఎస్కార్ట్ ఇవ్వడమే ఇందుకు నిదర్శనమన్నారు. నైతిక విలువలు, అభివృద్ధి అంటూ మాట్లాడే ఎమ్మెల్యే కడియం శ్రీహరికి దమ్ముంటే తన పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ గుర్తుపై పోటీ చేసి గెలవాలని రాజయ్య సవాల్ చేశారు. పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేలపై చర్యల కోసం హైకోర్టు నాలుగువారాల్లో చర్యలు తీసుకోవాలని అసెంబ్లీ స్పీకర్‌కు ఆదేశాలు ఇవ్వగా కడియం శ్రీహరి డివిజన్ బెంచ్‌కు, సుప్రీంకోర్టుకు వెళ్తాననడం సిగ్గుచేటన్నారు. సమావేశంలో మాజీ జెడ్పీటీసీలు మారపాక రవి, చాడ సరిత, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్, నాయకులు పాల్గొన్నారు.

టాటా కర్వ్ కారు ఆవిష్కరణ

● పాల్గొన్న ఎమ్మెల్యే నాయిని, దొంతి



కారును ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యేలు, 'కుడా' చైర్మన్

రామన్నపేట : వరంగల్ ములుగు రోడ్డులోని సెలక్ట్ మోటార్స్‌లో శనివారం సాయంత్రం అత్యంత భద్రత, ఆకర్షణీయమైన డిజైన్, అత్యాధునిక హంగులతో రూపొందించిన టాటా కర్వ్ నూతన కారును వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సెలక్ట్ మోటార్స్ అధినేత ముప్పిడి విజయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ..కర్వ్ పెట్రోల్, డీజిల్, ఎలక్ట్రిక్ మోడల్‌లలో లభిస్తోందన్నారు. నూతన కారులో అత్యాధునిక ఆటోమెటిక్ బ్రేకింగ్ సిస్టమ్(అడాస్ లేవల్-2) కలిగి ఉందన్నారు. అంతేకాకుండా స్పోర్ట్స్ కూపేతో బీఅండ్‌డబ్ల్యూ వలే ఆకర్షణీయమైన ఆకృతిలో కారును రూపొందించినట్లు పేర్కొన్నారు.కార్యక్రమంలో 'కుడా' చైర్మన్ ఇనుగాల వెంకట్రాం రెడ్డి, టాటా మోటార్స్ రీజనల్ హెడ్ గోపీకృష్ణ పాల్గొన్నారు.



బొగత వద్ద పర్యాటకుల సందడి

వాజేడు: జాలువారుతున్న బొగత జలసవ్వడి వద్ద శనివారం పర్యాటకులు సందడి చేశారు. సెలవు రోజు కావడంతో మండల పరిధిలోని చీకుపల్లి సమీపంలో గల బొగత జలపాతానికి పర్యాటకులు తరలివచ్చారు. నీటి కొలనులో స్నానాలు చేసి సేదదీరారు.

సాక్షి క్లాసిఫైడ్స్

EDUCATION

■ గీజుబాయ్ సెట్విన్ వారి PPTTC దసరా ట్రెనింగ్ ప్రోగ్రాం ప్లేవే మెథడ్ బోధన. అక్టోబర్ 2 నుండి ప్రారంభం. ట్రెనింగ్‌కి హాజరై SETWIN ద్వారా సర్టిఫికెట్ & ఉద్యోగం పొందండి. 7382733795, 9491818630. HNK. [W-1239987]

REAL ESTATE

TO-LET

■ WGL, కరీమాబాద్, బొమ్మలగుడి దగ్గర మెయిన్‌రోడ్ గ్రౌండ్ ఫ్లోర్ డీలక్స్ రూమ్స్ 2 BHK కిరాయికి ఇవ్వబడును. కిరాయి రూ॥ 10 వేలు. సంప్ర॥ 9848696291. [W-1239986]

■ 3 BHK residence 2400 Sft. Semi Furnished as per Vastu, Lift & Generator, Car Parking available. for rent @ Reddy Colony near Vikas High School, HNK, 88869 96262. [M-12143]

PLOTS FOR SALE

■ KUDA అప్రూవ్డ్ లే అవుట్ ప్లాట్స్, చింతగట్టు మరియు ఉనికిచర్ల రోడ్ సోమిడిలో అన్ని డెవలప్‌మెంట్స్‌తో అమ్మబడును. గజం కేవలం 15000/- మాత్రమే. సంప్ర॥ 9949732488. [WA-6524]

■ HNK, KITS College అంబాల రోడ్‌కు & ముచ్చర్ల రోడ్‌కు కొత్తగా వస్తున్న హైవే రోడ్‌కు దగ్గరలో 466.66 గజాలు గల ప్లాటు (40x105) అమ్మబడును. సంప్ర॥ 9553255936. [W-1239961]

■ మడికొండ చౌరస్తా దగ్గర నివాస గృహముల మధ్య 275 చ॥గ॥ FULL LRS కలిగిన EAST FACE Plot 32x75 అమ్మకమునకు గలదు. Contact: 8247304448. [WA-7537]

SERVICES

OLD AGE HOME

■ హన్మకొండ వడ్డెపల్లి నందు ఆధునిక వసతులతో గత పది సంవత్సరాల నుండి 50 మంది వృద్ధులకు సేవలు అందిస్తూ నూతనంగా బ్లాకు అందుబాటులోకి తేవడం జరిగింది. దయచేసి సంప్రదించగలరు. 9848444020, 9110551507. [W-1239906]

FINANCE SERVICES

■ సిరి అసోసియేట్స్: అన్ని రకాల రుణాలు, పర్సనల్, హౌసింగ్, మార్టిగేజ్, ఓపెన్ ప్లాట్స్‌పై & రిజిస్ట్రేషన్ చేయించి రుణాలు ఇప్పించబడును. సివిల్ ప్రాబ్లం ఉన్నా చేయించబడును. 9666142226. [W-1239958]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన రూ॥ 260/- అదనపు లైను రూ॥ 60/- మాత్రమే 5% GST అదనము

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్

■ మీ యొక్క సెప్టిక్ ట్యాంక్స్ నిండినవా? నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా మీ సెప్టిక్ ట్యాంక్స్ క్లీన్ చేయబడును. సంప్ర॥ డి.యస్. రావు. సెల్: 9849145043 [W-1239959]

BUSINESS OFFER

■ Hubertus మెడికల్ ప్రొడక్ట్స్ ప్రై Ltd కంపెనీ యొక్క Nitrile Gloves అమ్ముటకు డిస్ట్రిబ్యూటర్స్ కావలెను. ✆ 93980 31412 / 77802 21051 [B-4435]

WANTED

■ Walk in Interview for Assistant Security Officer, Security for CCTV. Monitoring. Cont: 7337313271, 9949499959. [WA-14709]

■ More than 10 yrs exprnc English fluent Lady Head/ IC to handle a Play- Primary School with admin/ indpndt skills wanted, BPlay School, Kasibugga, WGL. 8801066232, 8985100150. [W-1239988]

■ త్రినేత్ర హోం కేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను, చంటి పిల్లలను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీ : 17K. Ph: 8520874499, 8520980099 [H-796274]

■ Job Opportunity at Loukya Hybrid Seeds Pvt Ltd.: R.M (Hyd, 1 position,5-7 yrs exp), A.S.M (TS, 3 positions,3-5 yrs exp)& S.O (TS, 7 positions, 1-2yrs exp). Accountant - 4-5 years experience, Office Assistant-2, Peon -1 Share Resume at loukyaseeds@gmail.com or WhatsApp (+ 91 7995052252). No calls, please. [HA-6751]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వారా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.